చికిత్స పొందుతూ మహిళ మృతి



శంషాబాద్ రూరల్: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ గురువారం మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మండలంలోని తాళ్లగూడెంకు చెందిన తాళ్ల రాజుగౌడ్, మంగమ్మ (42) దంపతులు ఈ నెల 17న బైక్‌పై పాల్మాకుల వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తూ బెంగళూరు జాతీయ రహదారిపై పాల్మాకుల వద్ద రోడ్డు దాటుతున్నారు. ఇదే సమయంలో శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను వెనక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగమ్మను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆమె భర్త రాజుగౌడ్ శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలకు మంచినీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవడం జరుగుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ పిఅండ్‌టి కాలనీలో జలమండలి అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటికి మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అనేక కాలనీలు, బస్తీలకు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అధికారులు పైపులైన్ పనులను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. నీటి సమస్యను పూర్తిస్థాయిలో త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాపయ్యయాదవ్, జలమండలి సూపర్‌వైజర్ ప్రశాంత్, శానిటేషన్ జవాన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



భూపతిరావు (ఫైల్)

అత్తాపూర్: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ సీబీఐటీ కాలనీ ప్రాంతానికి చెందిన భూపతిరావు (74) కూతురు, అల్లుడు వెంకటేశ్వర్ రావుతో నివాసముంటున్నాడు. కాగా ఇటీవల కూతురు వద్దకు వచ్చిన భూపతి రావు ఇంట్లో చలి ఉందని.. ఎండకు బయట కూర్చుంటా అని బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

లైట్లు వెలుగుతున్నా రహదారిపై
కనపడని వెలుతురు



లైట్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు

- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
- రోడ్డుకు ఇరువైపుల లైట్లు ఏర్పాటు చేయాలి

సమస్యను పరిష్కరిస్తాం



ప్రధాన రహదారి కావడంతో రోడ్డు మధ్యలో చెట్లు అందంగా కనబడుతున్నాయి. రోడ్డు మధ్యలో ఉన్న హైమాస్టు లైట్లు అక్కడి నుంచి తొలగించాలి లేదా చెట్ల కొమ్మలను నరకాలి. రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తాను.

– నర్సింహగౌడ్ –రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

మైలార్‌దేవ్‌పల్లి: ఆ రోడ్డుపై వెలుతురు ఉన్న చీకటిగానే ఉంటుంది. పలు మార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకపోయింది. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు సంబంధింత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ సర్కిల్ వరకు ప్రధాన రోడ్డులో హైమాస్టు లైట్లు ఏర్పాటు చేసి అనేక సంవత్సరాలు అవుతుంది. 100 అడుగుల రోడ్డు కావడంతో వీటితో పాటు రోడ్డు మధ్యలో ట్రీగార్డులతో చిన్న మొక్కలను ఏర్పాటు చేశారు. అవి 15 సంవత్సరాల వ్యవధిలో హైమాస్టు స్తంభం ఎత్తులో భారీగా పెరిగాయి. దీంతో రాత్రి సమయంలో హైమాస్టు లైట్ల వెలుతురు ప్రధాన రహదారిపై పడకుండా చెట్ల కొమ్మలపై పడడంతో వెలుతురు క్రిందకి రాక ప్రతి నిత్యం రోడ్డులో చీకటిగా ఉంటుంది. ఈ ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీతో వాహనాలు వేల సంఖ్యలో తిరుగుతున్నాయి. మధ్యలో ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేక పోవడంతో వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. ఈ రోడ్డుకు ఇరువైపుల కాలనీలు, పరిశ్రమలు ఉండడంతో పాదచారులు బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటుతున్నారు. ప్రమాదాలు జరుగకుండా రోడ్డుకు ఇరువైపుల వీధిలైట్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



హైమాస్టు లైట్లు వెలుగుతున్న చీకటిగా కనిపిస్తున్న ప్రధాన రహదారి

రోడ్డు దాటుతూ మృత్యువాత



గతంలో మా నాన్న రోడ్డు దాటుతుండగా బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. గాయాలతో ఆసుపత్రిలో మృత్యువాత పడ్డాడు. మా కాలనీలో నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అనేక మంది గాయాలపాలయ్యారు. ఇప్పడు ప్రధాన రహదారిలో చెట్లు భారీగా పెరగడం వలన రోడ్డుపై వెలుతురు పడడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు మధ్యలో నుంచి హైమాస్టు లైట్లు తీసివేసి రోడ్డుకు ఇరువైపుల ఉండే విధంగా చూడాలి. మా నాన్నలా మరొకరికి ప్రమాదం జరుగకుండా చూడాలని అధికారులను కోరుకుంటున్నాను.

– గంజి ధనంజయ్ –మార్కండేయనగర్

ఎంజీఐటీలో కేరీర్ డెవలప్‌మెంట్ సెమినార్



సెమినార్‌లో పాల్గొన్న అతిథితో అధ్యాపకులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో గురువారం కెరీర్ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టూడెంట్ ట్రైబ్ యాప్ వ్యవస్థాపకుడు చరణ్ లక్కరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, కేరీర్ డెవలప్‌మెంట్, వ్యక్తిగత అభివృద్ధికి ఎలా దొహదం పడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఐటీ ప్రిన్సిపాల్ జి. చంద్రమోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ కె. సుధాకర్‌రెడ్డి, సీడీసీ డైరెక్టర్ సత్య సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు రుణాల పంపిణీ



రైతులకు రుణాల మంజూరు పత్రాలను అందజేస్తున్న చైర్మన్

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ సొసైటీ పరిధిలోని రైతులకు గురువారం చైర్మన్ బి.దొనాకర్‌గౌడ్ రుణాలు అందజేశారు. 24 మంది రైతులకు గాను రూ.19,40,000 రుణాలను పంపిణీ చేశారు. రైతులు రుణాలను సకాలంలో చెల్లిస్తే.. కొత్తగా రుణాలు తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. సొసైటీ ద్వారా అందజేసే రుణాలతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ప్రశాంత్‌రెడ్డి, విజయలక్ష్మీ, సీఈఓ యాదయ్య, సిబ్బంది సురేష్, మధుమతి, రైతులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల సత్తా



గోల్కొండ: విద్యార్థులు రెజ్లింగ్‌లో మక్కువ చూపుతున్నారని తెలంగాణ రాష్ట్ర రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జాఫర్ పహల్వాన్ అన్నారు. జాతీయ కుస్తీ పోటీలకు వివిధ విభాగాల కోసం రెజ్లింగ్ అసోసియేషన్ వారు గురువారం కార్వాన్‌లోని సబ్జీ మండీ విరాభిమన్యు వ్యాయామశాలలో అర్హత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హత సాధించిన విద్యార్థులకు ఆయన మెడల్స్‌తో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. గత దశాబ్ద కాలం నుంచి ప్రాథమిక తరగతుల నుంచే విద్యార్థులు రెజ్లింగ్ పట్ల ఆకర్షితులు అవుతున్నారన్నారు. కఠోర సాధన, క్రమ శిక్షణతో విద్యార్థులు రెజ్లింగ్‌లో అన్ని రకాల మెలకువలు నేర్చుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెజ్లింగ్‌ను ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని తాను కోరతానని అన్నారు. బాలబాలికల విభాగంలో అండర్–19 పోటీలు ఈనెల 26న న్యూఢిల్లీలో జరుగుతాయని కట్టా శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కార్యదర్శి కట్టా శ్రీనివాస్, కోచ్ సన్నీబాబు, పరిశీలకుడు జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ కోళ్ల పెంపకంపై శిక్షణ



పెరటి కోళ్ల పెంపకంలో మెలకువలు సూచించే పుస్తకాలు ఆవిష్కరించిన అధికారులు

ఏజీవర్సిటీ: రైతులు వ్యవసాయంతో పాటు పెరటికోళ్లను పెంచడం ద్వారా అదనపు ఆదాయాన్ని సాధించవచ్చని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలో పౌల్ట్రీ కోళ్ల పెంపకం అను అంశం పై రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో ఆయన పాల్గొని మాట్లడుతూ నాటుకోడి గుడ్లకు అలాగే మాంసానికి మంచి డిమాండ్ ఉందని అన్నారు. గ్రామాలలో రైతులు వ్యవసాయంతో పాటు పెరటి కోళ్లను పెంచడం ద్వారా పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు ఉపాధి కూడ ఉంటుందని అన్నారు. రాజశ్రీ కోడి కేవలం గుడ్ల కోసమే కాకుండా మాంసం కోసం కూడ ప్రత్యేకంగా రూపొందించబడందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ బార్బుదే, డాక్టర్ సాయిరెడ్డి, బసవరెడ్డి, శ్రీనివాస్ కృష్ణ, శ్రీలత, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు



స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మణికొండ కాంగ్రెస్ నాయకులు

మణికొండ: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైనా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మణికొండ కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆయన నివాసంలో కలిసి అభినందించి ఆయన ఆధ్వర్యంలో అసెంబ్లీ వ్యవహారాలు చక్కగా సాగి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు మాల్యాద్రినాయుడు, నాయకులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం



విద్యుత్ వినియోగదారులతో సమస్యలు తెసుకుంటున్న సీజీఎం ఆనంద్

మణికొండ: విద్యుత్ సరఫరా తదితర సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని చీఫ్ జనరల్ మేనేజర్ ఆనంద్ అన్నారు. గురువారం ఆయన నార్సింగి సబ్‌స్టేషన్ పరిధిలో రాందేవ్‌గూడ, నెక్నాంపూర్ తదితర గ్రామాలలో చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఆలీ ఫారూఖీ ఆదేశాల మేరకు ఆయన పర్యటించి విద్యుత్ వినియోగదారులతో సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, అందుకు అనుగుణంగా తమ యంత్రాంగం పనిచేస్తుందన్నారు. విద్యుత్ శాఖ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారులకు తెలియజేస్తే వారు వెంటనే పరిష్కరిస్తారన్నారు. సకాలంలో విద్యుత్ బిల్లులు, పాత బకాయిలు చెల్లించి తమతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఏఈ సందీప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు



రైతు దినోత్సవం సందర్భంగా విద్యార్థుల వేషాధారణలు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆర్యన్ పాఠశాలలో గురువారం రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రైతు వేషాల్లో ముస్తాబై పాఠశాలలకు వచ్చి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జైపాల్ మాట్లాడుతూ... రైతులు మన దేశానికి వెన్నెముక అని పేర్కొన్నారు. రైతులు పంటలు పండించే విధానాన్ని విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు. కర్షకులు లేకపోతే మనకు ఆహారం లేదన్నారు. అనంతరం విద్యార్థులను హార్టికల్చర్ యూనివర్సిటీకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూజ, షుసైలీ, సునిత, రాధిక, రంజనా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి



తన కార్యాలయానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఉదయం గోల్కొండ, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల నుంచి పలువురు వచ్చి ఆయనను కలిశారు. సబ్సిడీ ధరపై గ్యాస్ ఎల్‌పీజీ సిలిండర్లు, గృహలక్ష్మి తదితర పథకాలపై దరఖాస్తు చేసుకోవడానికి వారు ఎమ్మెల్యే సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పథకం ఇంకా ప్రారంభం కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఈ పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని ఆయన అన్నారు. అదే విధంగా గృహ నిర్మాణానికి మహిళలకు వర్తించే పథకంపై ఇంకా గైడ్ లైన్స్ రాలేదని అయితే వీటి దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా ఉండదని మంత్రులు స్పష్టం చేశారని ఆయన అన్నారు. ప్రజా దర్బార్‌లోనే ప్రజల మధ్యలోనే వీటి దరఖాస్తులు స్వీకరించబడుతాయని ఆయన అన్నారు. ఈనెల 28 నుంచి దరఖాస్తులు తీసుకునే ప్రక్రియ మొదలువుతుందని ఈలోపు నిబంధనల్లో సూచించిన ధ్రువపత్రాలు సిద్ధం ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్ తదితరులున్నారు.

50 ఫోన్ల రికవరీ.. బాధితులకు అప్పగింత



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి

అత్తాపూర్: సెల్‌ఫోన్ దొంగలించబడిన వెంటనే సీఈఐఆర్ యాప్ ద్వారా బ్లాక్ చేయడంతో పాటు ఫోన్ ఎక్కడుందో తెలుసుకోవడానికి గొప్ప అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించిందని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి సెల్‌ఫోన్ వినియోగదారులకు సూచించారు. ఇటీవల అత్తాపూర్ రాజేంద్రనగర్ ప్రాంతాల్లో దొంగలించబడిన ఫోన్లను రికవరీ చేసి ఫిటిషన్‌దారులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ నాగేంద్రబాబు, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పెండెం మధు, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం సీఈఐఆర్ వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని సెల్‌ఫోన్లు పొగొట్టుకున్న ప్రతి వినియోగదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కోరారు. ఈ యాప్ ద్వారా 50 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందని తెలిపారు. వినియోగదారుడు ఫోన్ కొనుగోలు చేసిన వెంటనే ఐఎంఈఐ నెంబర్‌ను గుర్తు పెట్టుకోవాల్సిన ఉంటుందన్నారు. ఈ నెంబర్‌తో పాటు పొగొట్టుకున్న మొబైల్ కంపెనీ పేరు, ఎక్కడ మిస్సైంది.. ఆ ప్రాంతంలో ఉన్న పోలీస్‌స్టేషన్ పరిధిని ఆధార్ కార్డు నంబర్, అడ్రస్‌తో యాప్‌లో పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో క్రైమ్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.



బాధితునికి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న డీసీపీ



డైపర్ గొడాన్‌లో మంటలు చలరేగుతున్న దృశ్యం

గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి: డైపర్ గొడౌన్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాటేదాన్ ప్రాంతలోని అమ్మాగార్డెన్ సమీపంలో రాయల్ మార్కెటింగ్ డైపర్స్ అండ్ పాంపర్స్ పేరిట గొడౌన్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా గొడౌన్‌లో మంటలు చలరేగాయి. దీంతో దట్టమైన పొగలు రావడంతో స్థానికులు పోలీసులకు సామాచారం అందించారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక దళానికి సమాచారం అందించడంతో అయిదు ఫైర్ ఇంజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి శ్రమిస్తున్నారు. ఎలాంటి ప్రాణనష్టం కలుగలేదు. భారీగా ఆస్తీ నష్టం అయినట్లు పోలీసులు తెలిపారు. విశాలంగా ఉన్న గొడౌన్‌లో భారీ మొత్తంలో డైపర్స్‌ను నిల్వ ఉంచడంతో భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి.

ఉపరాష్ట్రపతిని అవహేళన చేయడం సరికాదు



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కొండ విశ్వేశ్వర్ రెడ్డి, నాయకులు

రాజేంద్రనగర్: పార్లమెంట్ సమావేశం అనంతరం తృనమూల్ కాంగ్రెస్ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ భారత ఉపరాష్ట్రపతి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పై చేసిన అవహేళన ప్రదర్శనను ఖండిస్తూ రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పి. మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో డైరీఫాం చౌరస్తాలో నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డిలు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ..భారత దేశ చరిత్రలోనే ఉపరాష్ట్రపతిని ఇప్పటి వరకు అవహేళన చేయలేదని అన్నారు. ఒక నేషనల్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న రాహుల్ గాంధీ చిన్న పిల్లాడిలా వీడియో తీసి పెట్టడం సిగ్గు చేటని అన్నారు. బేషరతుగా గౌరవ ఉపరాష్ట్రపతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, ఎన్ మల్లారెడ్డి, మహాలింగంగౌడ్, బొక్క బాల్‌రెడ్డి, కార్పొరేటర్ సంగీత గౌరి శంకర్, సుధాకర్, లక్ష్మీనారాయణ, ఆర్. రాజశేఖర్, ఎస్. జగన్, కే. సదానంద్, రవి యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, అడికె జనార్ధన్, నిఖిల్, బాబురావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కార్యక్రమంలో యేసు పాటలు పాడుతున్న దృశ్యం



రాక్ చర్చిలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం యూనైటెడ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కిస్మత్‌పూర్‌లోని రాక్‌చర్చిలో ఫెడరేషన్ ఆఫ్ ఆల్ చర్చి క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ బీజేవైఎం ఆధ్వర్యంలో అన్ని చర్చిల ఫాదర్లు, బిషప్‌లు, రెవరెండ్లు, పాస్టర్లు, ప్రజలు, నాయకులతో యూనైటెడ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ నాయకులు స్వామిగౌడ్, కార్పొరేటర్ సురేష్‌గౌడ్, ప్రముఖ అంతర్జాతీయ సువార్త ప్రసంగికులు ఎడ్వర్డ విలియమ్స్, మన్నా మినిస్టర్ కో వ్యవస్థాపకులు బిషప్ రేచల్ కొమనాపల్లిలు హాజరై కేక్‌కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు, యేసు జనన, మరణ నాటకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జీవన్‌కుమార్, ఆశీర్వాదం, సుభాష్, లెనిన్ జోష్వువ, కరుణాకర్, వినోద్‌కుమార్, మల్లేష్, పాల్ తదితరులు పాల్గొన్నారు.